# పసుపు తాడు

రాధ కళ్ళల్లో నీళ్ళు నిండాయి. దుఃఖం గొంతులో అడ్డుపడి మాట రాకుండా, ఊపిరాడకుండా ఉక్కిరి బిక్కిరి చేసింది.

కోపం, బాధ నరనరాన్నీ తెంపేస్తున్నట్టనిపించింది. జుట్టు పీక్కుని భోరుమని ఏడవాలనిపించింది.

కానీ ఏమీ చెయ్యలేని నిస్సహాయత ఒక రకమైన నీరసాన్ని కలిగించింది. మంచంమీద పడుకుని దిండులో మొహం దాచుకుని ఆలోచనలో పడిపోయింది దిక్కుతోచనిదానిలా.

మనిషి జీవితంలో ఏవేవో చెయ్యాలనుకుంటాడు. జీవితాన్ని పూల పానుపులా వూహించుకుని కమ్మని కలలు కంటాడు. ఏ కొందరు అదృష్ట వంతులకో తప్ప ఆ కలలు నిజంకావు. పైగా ఏ ముళ్ళకంచెకో చిక్కుకు పోతుంది జీవితం. వేటగాని వల్లుత కిడికి గిలగిల కొట్టుకుపోయే పక్షిలాగా పరిస్థితుల తాకిడికి తట్టుకోలేక విలవిల్లాడి పోతాడు. ఒక్కొక్కరి జీవితాన్ని చేజేతులా అంతం చేసుకుంటాడు.

సరిగ్గా అదే జరిగింది వత్సల విషయంలో. రాధ మనస్సు గతాన్ని తవ్వింది. వత్సల జ్ఞాపకం వచ్చినప్పుడల్లా రాధకి పిచ్చెక్కినట్టవుతుంది. మనస్సు బాధతో విలవిల్లాడిపోతుంది.

రాధా వత్సలా క్లాస్‌మేట్స్. స్కూలు జీవితంలో ప్రారంభమయిన వారి స్నేహం కాలేజీ డిగ్రీ పుచ్చుకోవడంతో ముగిసిపోయింది. ఒకే బాటన నడిచే వారి జీవితాలు రెండుగా చీలిపోయినై.

రాధ పరమేశ్వరావు ఏకైక పుత్రిక. లలితాంబ, తాను నోచిన నోములఫలమే రాధ అని ఆమెని ఆరోప్రాణంగా చూసుకునేవారు. ఏ అరమరికలూ లేకుండా రాధని మగపిల్లాడిలా పెంచారు.

రాధ స్కూలుకి సైకిల్ మీద వెళ్ళేది. కాలేజీలో చేరాక స్కూటరు కొనుక్కుంది. ఆ రోజుల్లో సికిందరాబాదు మారేడిపల్లినుంచి, హైదరాబాదు లోని నిజాం కాలేజీదాకా స్కూటరుమీద వెళ్ళే ఆడపిల్ల రాధ ఒక్కతే!

రాధ లిఫ్టిచ్చినా, రాధతో స్కూటర్ వెనక సీటుమీద కూర్చునాస్తే వత్సలావాళ్ళ అమ్మానాన్నా కేకలేసేవారు. వత్సలతల్లి మంగమ్మకి అతి మడీ ఆచారమూనూ! తండ్రి రాఘవరావుగారికి పరమఛాదస్తం! ఇంట్లో చెప్పులేసుకు తిరిగితేతప్పు, పమిటకొంగు, మెడచుట్టూ కప్పుకోకపోతే తప్పు, పెద్దగా నవ్వితే తప్పు! గట్టిగా మాట్లాడినా తప్పే! ప్రతీ విషయానికీ, ఆక్షేపణలూ ఆజ్ఞాపింపులూనూ, బి.ఏ. కాగానే చదువు మాన్పించారు వత్సలని. రాధ ఎమ్.ఏ.లో చేరింది.

° ° ° ° ° ° ° ° ° °

రాధ ఆలోచిస్తోంది. అసలు తనకీ వత్సలకీ స్నేహం ఎలా కుదిరిందాఅని. రాధా వాళ్ళింటిలో ఏ పట్టింపులూ లేవు. హాయిగా నవ్వడం, కలివిడిగా తిరగడం, సరదాగా వుండడం. ఆ ఇంటిలో అందరికీ వుంది. అది వారికెంతో సహజంగా అనిపిస్తుంది. అనుక్షణం, ఆడామగా తేడాలు గుర్తుతెచ్చుకుంటూ ప్రవర్తించడం, అసలే లేదు. అందుకేనేమో తనకి ఏ మగాడితో మాట్లాడినా ఏమీ అనిపించదు. ఒక స్నేహితురాలితో మాట్లాడుతున్న స్నేహభావనే కలుగుతుంది. కొంతమంది ఏమిటో మగాళ్ళతో మాట్లాడుతుంటే పమిటకొంగు పదేపదే సర్దుకుంటూ మెలికలు తిరిగిపోతారు, అనుకుని నవ్వుకుంది రాధ.

“మనస్సు పవిత్రంగా వుండాలమ్మా! నిర్మలమైన మనస్సుకీ ఈ చేతలకీ యేమీ సంబంధంలేదు” అనేది అమ్మ.

“మగాడితో ధైర్యంగా మాట్లాడడానికి జంకూ భయమూ దేనికమ్మా? అతనూ సాటి మనిషేగా! ఎదుటివాళ్ళ ప్రవర్తనెప్పుడూ మన ప్రవర్తనమీద ఆధారపడి వుంటుంది” అనేవారు నాన్న! వారి మాటలు జ్ఞాపకం రాగానే వారికి తాను బిడ్డగా పుట్టినందుకు గర్వించేది రాధ. కానీ వత్సల జ్ఞాపకం రాగానే పంజరంలో పక్షిని చూసినట్టు జాలిపడేది.

పెళ్ళి అనే మార్కెట్టులో షోరూంలోని బొమ్మలా బేరం తగిలినప్పుడల్లా తయారయ్యేది వత్సల. బేరం కుదరక వాళ్ళు వెళ్ళిపోయేవారు. వత్సల తల్లీ తండ్రీ ఆడపిల్లను కన్నందుకు తమని తాము నిందించుకునేవారు, అదేదో పెద్ద తప్పిదమయినట్టు. ఆ మాటలు వినలేక కృంగిపోయేది వత్సల.

ఆరోజు వత్సల రాధని అర్జంటుగా రమ్మని కబురు పెట్టింది. "ఏమైనా వుంటుందా? బహుశ పెళ్ళి కుదిరిందేమో!" అనుకుంటూ బయలుదేరింది రాధ. ఇంటిలో వత్సల చెల్లెలు వకుళ తమ్ముడు రఘు మాత్రమే వున్నారు. రాధని చూడగానే ఒక్క అంగలో పరుగులాంటి నడకతో ఎదురొచ్చింది వత్సల

"యేమిటే ఇంత సంతోషంగా వున్నావ్? అర్జంటుగా రమ్మని కబురుపెట్టావ్! యేమిటి విశేషం" కన్నుకొడుతూ కొంటెగా అడిగింది రాధ.

"నీతో బోలెడు విషయాలు చెప్పాలి" అంది సంతోషంగా వత్సల చాటంత మొహం చేసుకుని.

"యేమిటి పెళ్ళి కబుర్లేనా?" కొంటెగా అడిగింది.

"కాదు, ప్రేమకబుర్లు" ముసిముసిగా నవ్వుతూ చెప్పింది వత్సల. రాధ ఉలిక్కిపడింది. ఆశ్చర్యంలోనుంచి తేరుకుంటూ "ఏదీ చెప్పు! ఎవరా మన్మధుడు, ఏమా కథ!" అంటూ నవ్వింది రాధ.

"ఉండు నీకోసం ఉల్లిపాయ పకోడీలు చేశాను. తింటూ విందువుగాని" అంటూ గబగబ ప్లేట్‌లో పకోడీలు పెట్టి తెచ్చింది వత్సల.

"అవునూ, మీ అమ్మా, నాన్నా కనబడరేం?" భయపడుతూ భయపడుతూ అడిగింది రాధ.

"మద్రాసెళ్ళారు. మా పిన్నికూతురు పెళ్ళి" అంది వత్సల.

"అదా సంగతి, అందుకే అమ్మాయిగారింత హుషారుగా ఉన్నారు

"ఊ... సరే, ఇక మొదలెట్టు, అసలు కథ" అంది పకోడీలు ఒక్కొక్కటే నోట్లో వేసుకుంటూ రాధ.

వత్సల మొహం అరవిరిసిన గులాబీలా ఎఱ్ఱబడింది. "రాధా! ఈ విషయం ఇంకా ఎవ్వరికీ తెలీదు. ముందుగా నీకే చెబుతున్నాను. అసలు నీకూ ఎలా చెప్పాలో తెలీడం లేదు"

"సర్లే సర్లే చెప్పు" అంది ఇంక ఆగలేనట్టు రాధ.

"రాధా! మా పక్కింటి సుధాకర్‌కి నాకూ క్రిందటి శుక్రవారం నాడు పెళ్లయిపోయింది" అంది. రాధకి మతిపోయినంత పనయింది. తనేం వింటోందో తనకర్థం కావటంలేదు. వత్సలకి పిచ్చెక్కలేదు కదా, అనిపించింది ఆ క్షణంలో. మాట పెగలక మూగదానిలా, వత్సలకేసి చూస్తూ వుండిపోయింది.

"ఆశ్చర్యంగా వుందికదూ! నువ్వు నమ్మలేవు. కానీ ఇది నిజం. కావాలంటే ఈ పసుపుతాడు చూడు!" అంటూ జాకెట్టు లోపల ఎవ్వరికీ కనిపించకుండా భద్రంగా దాచుకున్న పసుపుకొమ్ముతో కట్టిన పసుపు తాడుని చూపించింది

"వత్సలా! ఎంతపనిచేశావే! ఏమైనా గొడవలొస్తే రేపు ఈ పసుపు తాడు నీకు సాక్షమిస్తుందా? పెళ్ళి పదిమందికీ తెలియజెయ్యడం సాక్ష్యం కోసమేనే! అంత అర్జంటుగా ఎందుకీ పనిచేశావ్? కొంపదీసి..."

"రాధా! లేదు...లేదు... నన్ను నమ్ము" అలాంటిదేదీ జరగలేదు. నిజానికి మేము కలిసి ఏడడుగులైనా నడవలేదు" అంది కంగారుగా వత్సల.

"మరి ఎందుకీ పనిచేశావ్?" అర్థంకాక ప్రశ్నించింది రాధ.

"రాధా! ఒకరోజు సుధాకర్ నన్ను ప్రేమిస్తున్నానని చెప్పాడు. నాకూ అతణ్ణి ప్రేమిస్తున్నట్టే అనిపించింది. వాళ్ళ కులంలో అతనికి లక్షల కట్నంతో పిల్లనిస్తామంటూ ఒస్తున్నారు. కాని సుధాకర్‌కి ఇష్టం లేదు. మా ఇంట్లోనూ ఈ కులాంతర వివాహానికి ఒప్పుకోరు నీకు తెలుసుగా! అందుకే ఈ పని చెయ్యాల్సొచ్చింది" అంది.

"వత్సలా! నీ చదువూ తెలివితేటలూ అన్నీ ఏ గంగలో కలిశాయే? ఆ తాడు కట్టించుకుని నీ గొంతు కోయించుకున్నావ్! అంత నువ్వంటే ఇష్టమయితే సుధాకర్‌కి వాళ్ళవాళ్ళతో పోట్లాడయినా నిన్ను చేసుకోవచ్చుగా! నువ్వూ అంతే! మీరిద్దరూ మేజర్లే! ఏ రిజిష్ట్రార్ ఆఫీసులోనైనా నోటీసిచ్చి పెళ్ళిచేసుకోవచ్చుగా!" ఆవేశంగా అంది రాధ

"సుధాకర్ మనసు వెన్నలాంటిది, ఎవరినీ కష్టపెట్టలేడు. తరవాత మెల్లగా నచ్చచెబుతాట్ట".

"పిచ్చిదానా! టా...ట్టాలువిని బోల్తాపడ్డావేమోనని నా భయం. వెన్నలాంటి మనసు కాబట్టే కరిగిపోతుందేమోనని భయమే"

ఫకాలున పగలబడి నవ్వింది వత్సల రాధ మాటలకి.

ఆ నవ్వులో ఏదో తృప్తి, ఆ కళ్ళలో మెరిసే ఆనందం, రాధ గమనించింది. ఏదో భయం రాధను వేధిస్తూనే ఉంది.

"అసలీతాడు ఎలా కట్టాడు? నువ్వూ అతనూ ఎలా కలుసుకున్నారు?" అడిగింది.

"నాలుగైదుసార్లు సికింద్రాబాద్ స్టేషను దగ్గరున్న విఘ్నేశ్వర స్వామి గుళ్ళో కలుసుకున్నాము. మాట్లాడకుండా కళ్ళతో చూసుకున్నా

పెదవివిప్పి మాట్లాడుకోలేదు. కానీ ఆరోజు...శుక్రవారం అర్చన చేయి ద్దామని గుడికివెళ్ళాను. అతనూ అక్కడే ఉన్నాడు అర్చనకోసం. పక్క పక్కనన ంచుని అర్చనచేయిస్తూంటే, ఏదో ఆనందం, అనిర్వచనీయమైన అనుభూతి కలిగింది. అర్చనయిపోయాక ఇద్దరం వెళ్ళి ఒక పక్కగా కూర్చుని, కొబ్బరి ముక్కలు కొట్టి ప్రసాదం తిన్నాం. అతను మెల్లగా

"వత్సలా, నేను నీ కిష్టమేనా?" అన్నాడు.

కమ్మని తలపులలో నిండిపోయిన నా హృదయం ఒక్క నిమిషం ఆనందంతో ఊగిపోయింది "ఊఁ", అన్నాను బరువుగా.

"మరయితే మాట్లాడవేం" అన్నాడు అదోలాంటి గొంతుకతో.

"ఏం మాట్లాడను" ఎలాగో గొంతు పెకలించుకుని అన్నాను.

"వత్సలా! నిన్ను చిన్నప్పటినుంచి చూస్తూనే వున్నా, ప్రేమి స్తూనే ఉన్నా. నీతో చెప్పడానికి అవకాశం రాలేదు. భగవంతుడే మనని క్కడ కలిపాడు. ఏమంటావ్" తన్మయత్వంలో తేలిపోతూన్న నాకు మాట రావడంలేదు. "అవునండీ" అన్నాను. అంతే "వత్సలా అభ్యంతరం లేక పోతే నేను నిన్ను పెళ్లిచేసుకుంటాను " అన్నాడు.

అతను చెప్పే ప్రతీ మాటకీ నా మనసు ఆనందంతో ఉక్కిరి బిక్కిరయిపోతోంది. శరీరం తేలికై పట్టుతప్పి తూలిపోతూన్నట్టనిపించింది. నేను మాట్లాడలేదు. "చెప్పు వత్సలా! నేనిష్టంలేదా?" అన్నాడు. అతని లోని ఆత్మీయత, ప్రాధేయత నన్ను పరవశింపజేశాయి. కట్నంఇచ్చి పెళ్ళి చెయ్యలేక కుమిలిపోతూన్న అమ్మా నాన్నా నాకళ్ళకి కనిపించారు. ఈ పెళ్ళి చేసుకుంటే వారిని కట్నాలబాధనుండి తప్పించొచ్చనుకున్నాను.

సుధాకర్ ఔదార్యానికి నమస్కరించాలనిపించింది. వెంటనే పాదాభివందనం చేశాను. నన్ను లేవదీసి గుండెలకు హత్తుకున్నాడు. గుళ్లో ఆమూల ఎవ్వరూ లేరు, అతని కౌగిటిలో కాస్సేపు కరిగిపోయాను. నా నరనరం పులకరించి పోయింది. అంతలోనే అమ్మా నాన్నా మనసులో మళ్ళీ మెదిలారు. సాంప్రదాయాలూ, ఆచారాలూ అన్నీ గజిబిజిగా కళ్ళముందు కదిలాయి. కౌగిలి వదిలి దూరంగా జరిగాను "ఏం? సిగ్గుపడుతున్నావా?" నా చేతిని తన చేతిలోకి తీసుకుని అడిగాడు సుధాకర్ "మా వాళ్ళు ఈ పెళ్ళికి ససేమిరా ఒప్పుకోరు. వారి సాంప్రదాయాలూ, ఆచారాలూ చస్తే ఒదులుకోరు ఈ పెళ్ళి జరగనివ్వరు" అన్నాను భయంగా.

సుధాకర్ నవ్వాడు. అతనికేసి ఆశ్చర్యంగా చూశాను. "నాకు తెలుసు ఆ విషయం" అన్నాడు నవ్వుతూనే. ఆ నవ్వులో వెన్నెలలు పూశాయి. వేణువులు పాడాయి.

"మరి?" అన్నాను పరిష్కారం వెతుకుతూ.

"కులం తక్కువని ఈ పెళ్ళికి మీ వాళ్ళు ఒప్పుకోరు. మనం రిజిస్టర్ పెళ్ళి చేసుకుందాం ఈలోగా నువ్వు నాదానవని నా తృప్తికోసం ఈ గుళ్ళోనే నీ మెళ్ళో పసుపుతాడు కడతాను సరేనా?" మళ్ళీ గుండెలకు హత్తుకున్నాడు నన్ను. ఆ ఆలింగనంలో కోటి స్వర్గాలు కనిపించాయి. కొంచెంత ధైర్యం వచ్చింది. "సరే" అన్నాను. అంతే! మర్నాడు మళ్ళీ అక్కడే కలుసుకున్నాం. పంచభూతాల సాక్షిగా విఘ్నేశ్వరుడి సాక్షిగా నా మెడలో పసుపుతాడు కట్టాడు. అర్చన చేయించాం. కొబ్బరిముక్కలు తిన్నాం. కౌగిలింతలో కరిగిపోయాం నా ముఖాన్ని ముద్దుల్లో ముంచేశాడు. అంతే! అంతకన్నా ఏం జరగలేదు" అంది తన్మయత్వంతో తేలిపోతూ వత్సల.

మంత్రముగ్ధలా వింది రాధ. అంతా సినిమాలా వుంది. వత్సల ఇంకా చెబుతూనే వుంది. తన్మయత్వంతో "రాధా! ఉదయం స్నానం చేస్తున్నప్పుడు, రాత్రి నిద్ర పోతున్నప్పుడు నా గుండెలమీది ఈ పసుపు కొమ్ముని మనసారా ముద్దుపెట్టుకుంటాను దీన్ని చూస్తూంటే నాకు ఆయనే జ్ఞాపకం వస్తారు. ఛీ! నీతో ఇంత సిగ్గువిడిచి చెబుతున్నాను నా గురించి ఏమనుకుంటున్నావో ఏమో!" రెండు చేతుల్లోనూ మొహాన్ని దాచుకుంటూ అంది.

వత్సల పిచ్చి ప్రేమకీ, ఆ పసుపుతాడుమీద ఆమెకున్న గుడ్డి నమ్మకానికీ ఆమె ధైర్య సాహసాలకీ రాధ ఆశ్చర్యపోవడం తప్ప చేసే దేముంది? వత్సల నూరడిస్తూ "పిచ్చిదానా? నామీద నమ్మకంతో నీ మనసులోని మాటలన్నీ చెప్పుకుని, నీ గుండెల్లోని భారాన్ని దించుకుంటున్నందుకు సంతోషిస్తున్నాను.

ఎట్టి పరిస్థితుల్లోనూ చలించక ధైర్యంగా వుండు. నువ్వూ సుధాకర్ ఒకరైతే ఎవ్వరూ ఏమీ చెయ్యలేరు. నీ పసుపుతాడే నీకు శ్రీరామ రక్ష" అంది. మనసులోనే భగవంతుణ్ణి వత్సల జీవితాన్ని సరిగ్గా చూడమని వేడుకుంటూ.

o o o o o o o o o o

ఆ మర్నాడు సాయంత్రం కాలేజీనుంచి రాగానే, తన బీరువాలో ఉన్న చిలకపచ్చ, తోపురంగు జరీకంచిపట్టు చీర, జాకెట్టుబట్ట తీసింది. "వత్సల దగ్గరికెళ్ళొస్తానమ్మా" అని చెప్పి బజారుకెళ్ళి అరటిపళ్ళు, మిఠాయి కొంది.

హఠాత్తుగా వూడి పడ్డ రాధను చూసి వత్సల పొంగిపోయింది. "ఏమిటి ఈ ఆర్భాటం అంతా? ఇవన్నీ ఇప్పుడెందుకు" అంది భయంగా. వత్సల పక్కనున్న చెల్లెలికేసి చూస్తూ వత్సల భయాన్ని గ్రహించిన "రాధ" ఇవ్వాళ నా పుట్టినరోజు. ఈసారి నా పుట్టినరోజుకి నా పేరుమీద ఎవరికైనా బొట్టుపెట్టి చీర ఇస్తానని మా అమ్మ మొక్కుకుందిట. అయితే ఎవరికో ఎందుకు? నా స్నేహితురాలికే ఇస్తానని ఇక్కడికొచ్చా, తీసుకో వత్సలా" అంది. వకుళ ఆశ్చర్యంగా చూస్తూ వుండిపోయింది.

వత్సల కళ్ళు ఆనందంతో చెమ్మగిల్లాయి, "రాధా! జన్మ జన్మలకీ నీ స్నేహితురాలిగా పుట్టాలని కోరుకుంటున్నానే" అంది కృతజ్ఞతాపూర్వకంగా.

"ఛీ! అప్పుడూ స్నేహితురాలే! నేను మొగాడుగా పుట్టి నువ్వు ఆడదానిగా పుడితే నేను నిన్ను స్వయంవరంలో పెళ్ళి చేసుకుంటాను" అంది. అందరూ పగలబడి నవ్వేశారు.

వత్సలని ఆ చీర కట్టుకురమ్మని బలవంత చేసింది రాధ. ఆ చీరలో వత్సలని చూస్తూ, నోరుతెరిచింది రాధ. నిజంగా కొత్త పెళ్ళికూతురిలా కళకళ్లాడి పోతోంది వత్సల మొహం. పసిమిరంగు శరీరచ్ఛాయకు చిలుకపచ్చరంగు, మెరుగునిచ్చింది రాధవత్సల పసుపుతాడు బంగారుతాడై బంధం కలకాలం నిలవాలని కోరుకుంది.

ఆరోజు ఎంతోసేపు కబుర్లు చెప్పుకున్నారు. బాగా చీకటిపడేదాకా వాళ్ళకి టైము తెలీనేలేదు. "వత్సలా! వెళ్ళొస్తానే, రేపటినుంచి మాకేవో టెస్టులున్నాయ్. పేపరొకటి సబ్మిట్ చెయ్యాలి. ఈ వారంఅంతా ఖాళీ వుండదు, ఆదివారంరోజు పొద్దుటే వస్తాను" అని చెప్పి వత్సల దగ్గర

సెలవు తీసుకుంది, రాధ. ఇద్దరు స్నేహితులూ ఒదలలేక ఒదలలేక కనుమరుగయ్యే వరకూ చెయ్యూపుకున్నారు తృప్తిగా.

o o o o o o

కాలేజీలో అలసిపోయి ఇంటికొచ్చి మంచంమీద వాలిపోయింది రాధ. తల్లి కాఫీతెచ్చి అందించింది. "అమ్మా, ఇవాళంతా ఎలాగోవుంద మ్మా. తల నెప్పిగా ఉంది" అంది రాధ తల్లిఒళ్ళో తలపెడుతూ.

అంతలోనే సాయంత్రం పోస్టుమాన్ 'పోస్టు' అంటూ కవరొకటి పడేసి వెళ్ళిపోయాడు. రాధ వెళ్ళి కవరు తీసింది. దస్తూరిచూసి ఎగిరి గంతేసింది, "వత్సల దగ్గరనుంచి ఉత్తరం వచ్చిందమ్మా" అంటూ గబాగబా కాఫీ తాగేసి కప్పు అక్కడపెట్టి కవరు చింపి చదవడం మొదలెట్టింది. ఉత్తరం చదువుతున్న రాధ "నో....నో..."అంటూ పిచ్చిదానిలా అక వడం చూసి "ఏంజరిగిందమ్మా" అంటూ తల్లి ఆమెను చుట్టేసింది, రాధ ఏడుస్తూ ఉత్తరం చదివి వినిపించింది.

ప్రియాతి ప్రియమైన రాధా!

ఆ రోజు నవ్వున్నావే ఈ పసుపుతాడు నీ గొంతుకోసే ఉరితాడు కాకూడదని. కాని అది నాపాలిట ఉరితాడే అయింది. నా కథకి మొదలు నీ ఒక్కదానికే తెలుసు. అందుకే ముగింపుకూడా నీకు చెప్పాలని ఈ వుత్తరం రాస్తున్నాను. నా గురించి ఈ పాటికి నలుగురూ నానా రకాలుగా అనుకుంటూ ఉంటారు. కానీ నిజం నీ ఒక్కదానికైనా తెలిస్తేచాలు. నాకదే తృప్తి, అందుకే ఈ ఆఖరి ఉత్తరాన్ని నీకు రాస్తున్నాను.

నా మెళ్లోని పసుపుతాడుని ఒకనాడు పసిగట్టేసింది వకుళ అంతే! మా ఇంట్లో యుద్ధం మొదలయింది. అమ్మ చచ్చేట్టు కొట్టింది. నాన్న అలసిపోయేదాకా తిట్టారు. సుధాకర్ ఇంటికెళ్ళి నాన్న నిలదీసి అడిగారు అతన్ని. మా అమ్మాయిని పెళ్ళిచేసుకున్నావా అని. ఈ విషయం విన్న సుధాకర్ వాళ్ళమ్మ నెత్తీ నోరూ కొట్టుకుని పెరటిలో వున్న బావిలో పడటానికి పూనుకుంది. ఆ అమ్మాయిని చేసుకుంటే చస్తానని ఖచ్చితంగా చెప్పింది వాళ్ళమ్మ మాటలకి సుధాకర్ భయపడి పోయాడు. వాళ్ళమ్మకి మాటిచ్చాడు తన ఇష్ట ప్రకారమే నడుస్తానని దాంతో మా నాన్నకి పిచ్చెక్కినంత పనయింది. ఇంటికొచ్చి తలబాదుకుని ఏడ్చారు. నా గుండెలమీది పసుపుతాడు నన్ను వెక్కిరించినట్టయింది. ఆవేశంగా నేనే సుధాకర్ దగ్గరకెళ్ళి అడిగాను "ఈ పసుపుతాడుకి అర్థమేమిటని?" పెద్దవాళ్ళని క్షోభపెట్టి మనం మాత్రం ఏం బాగుపడతాం వత్సలా! ఈ పసుపుతాడు తప్ప మనమధ్య ఏమీ జరగలేదుకదా! మన పెద్దలను తృప్తిపరిచే విధంగా మనం వాళ్ళ ఇష్టప్రకారమే నడుచుకుందాం" అన్నాడు నెమ్మదిగా.

రాధా! ఆ నిమిషంలో నాకు అతనిమీద ఎంత అసహ్యం వేసిందో మాటల్లో చెప్పలేను. నా చేతిలో ఏదైనా ఆయుధం వుంటే బహుశః అతడిని చంపేదాన్నేమో కూడా. నాగుండెలమీది పసుపుతాడు త్రాచుపాములా అనిపించింది. తెంచిపారేసి అతనిమొహాన విసిరికొట్టాను. రాధా! ప్రాణప్రదమనుకున్న పసుపుతాడు, మంగళదాయకమనుకున్న ఆ పసుపుతాడు ఒట్టి పనికిమాలినదే కాకుండా నా ప్రాణాలు అపహరించేదని తెలుసుకునేసరికి సమయం మించిపోయింది. ఆ తాడుని చూసిన జనం నన్ను నానా మాటలూ అన్నారు. కొన్నాళ్ళు అతనితో కులికానన్నారు. చెడిపోయానన్నారు. రాధా, నేనేపాపమూ ఎరుగనని వారిని ఎలా నమ్మించాలి? ఎలా నిరూపించాలి?

ప్రతి పెళ్ళికొడుకు ముందూ అంగట్లో బొమ్మలా నుంచున్నాను. అమ్మా నాన్నా కట్నాలిచ్చుకోలేక నాకు పెళ్ళికాక కుమిలిపోతూ వుంటే కోరుకున్నవాడి మాటలు నమ్మి, భగవంతుని సన్నిధిలో పసుపుతాడు కట్టించుకోవడం చెడిపోవడమా? అయితే సుధాకర్ చెడిపోలేదా? సమాజం అతన్ని ఈ మాట అనదు. మగాడు చెడడు కాబోలు ఏంచేసినా. చివరికి గుళ్ళోని దేవుడూ బండరాయిలా ఊరుకున్నాడేగానీ, నా ప్రశ్నలకి సమాధానం చెప్పాడా రాధా, ఆ మర్నాడే వాళ్ళమ్మ సుధాకర్‌కి లక్ష రూపాయల కట్నంతో, అదివరకే సిద్ధంగా వున్న సంబంధాన్ని ఖాయపరచింది. అవతల పిల్లనిచ్చేవాళ్ళు సుధాకర్ చెడిపోయాడనను. సరసుడు అనుకున్నారేమో? కాని నాకు పెళ్ళి కాదు, నేను చెడిపోయానుగా రాధా! ఈ అన్యాయపు ప్రపంచంలో, ఈ కుళ్ళు సమాజంలో, నేను బ్రతకలేను నా కుటుంబానికి మచ్చగా నిలువలేను. నా చెడును నాతోనే కాల్చి మసి చేసేస్తాను రాధా! నువ్విచ్చావే, పట్టుచీర దాన్ని నాతోనే తీసుకెళుతున్నాను. పవిత్రమైన అగ్నితాకిడికి పాపప్రక్షాళనం జరుగుతుందంటారు. నేను సజీవంగా దహనమై పోతున్నాను గుడ్... బై ...మళ్ళి జన్మలో నువ్వున్నావే నువ్వు మగాడిగా పుట్టు నేను ఆడదానిగా పుడతాను. నువ్వు నన్ను స్వయంవరంలో పెళ్ళి చేసుకుంటానన్నావుగా! వుంటామరి రాధా! నా జీవితంలో మరపురానిది నీ తియ్యని స్నేహమేసుమా!

ఇట్లు
దురదృష్టవంతురాలు
—వత్సల

రాధ మూర్ఛపోయింది. కళ్ళుతెరచేసరికి చుట్టూ జనం వున్నారు. డాక్టరుగారున్నారు. "అమ్మా... వత్సల చచ్చిపోయిందమ్మా... కాదు...

చంపేశారు! సుధాకర్... కాదు... సమాజం..." భోరున ఏడ్చింది. డాక్టర్ కాంపోజ్ ఇంజక్షన్ ఇచ్చాడు, ఆమెకు విశ్రాంతి నివ్వడానికి.

రాధ కోలుకోవడానికి వది రోజులు పట్టింది. కాలేజికి వెళ్తోంది. కాలం గడుస్తూనేవుంది. రెండు సంవత్సరాలు ఎలాగడిచేయో రాధకే తెలీదు

ఇప్పుడు రాధ పుత్తరాధ కాదు. మిసెస్ రాధామాధవ్. మహిళా కళాశాలలో లెక్చరరు. క్లాసులో పాఠాలు చెబుతూన్నప్పుడు అవకాశం వచ్చినప్పుడల్లా మిసెస్ రాధామాధవ్ వత్సల కథ చెబుతుంది. "జాగ్రత్త సుమా; ప్రేమగుడ్డిది ఎవరిని గుడ్డిగా నమ్మకండి" అంటూ హెచ్చరిస్తుంది. అలా చెప్పినప్పుడల్లా ఆమెకవోరకం తృప్తి కలుగుతుంది. అదేదో తన బాధ్యతయినట్టు ఫీలౌతుంది. కాలం నడుస్తూనే వుంది. ఈ జీవనయానంలో ఎందరో వత్సలలు! ఎన్నో సుడిగుండాలు!